నమస్తే తెలంగాణ
మెదక్

8 | హైదరాబాద్, మంగళవారం 9 జనవరి 2024 | MEDAK

కలెక్టరేట్‌లో ప్రజావాణిలో భాగంగా ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

అర్ధమండపంలో నిర్వహించిన మండపారాధన పూజల్లో పాల్గొన్న అర్చకులు

సమస్యల పరిష్కారానికే ప్రజావాణి : కలెక్టర్

మెదక్, జనవరి 8(నమస్తే తెలంగాణ): సమస్యల పరిష్కారానికి ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రాజర్షి షా అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజల వద్ద నుంచి 82 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు సమర్పించిన దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నేటి ఫిర్యాదుల్లో ఎక్కువగా భూములు, ఉద్యోగం, ఉపాధి తదితర ఉన్నాయన్నారు. వాటిని త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ధరణిపై ఎల్లం, లక్ష్మిలు తూప్రాన్, నవీన్, కిష్టయ్య కొల్చారం, రాజేందర్ రెడ్డి రామాయంపేట, లావణ్య శంకరంపేట వారు భూ సమస్యల పరిష్కారం కోసం, మున్సిపల్‌లో అనుమతుల కోసం కె.కృష్ణ రామాయంపేట, ఉపాధి, ఉద్యోగం కోసం వినోద శివ్వంపేట్, శంకర్‌లు వివిధ అంశాలపై ఫిర్యాదులు వేశారు. పెన్షన్ కోసం రాములు నిజాంపేట్, బాలకిషన్ కౌడిపల్లి నుంచి ఫిర్యాదులు అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టరు వెంకటేశ్వర్లు, డీఆర్‌వో పద్మశ్రీ, డీపీవో సాయిబాబా, మైనింగ్ అండ్ జియాలజీ సహాయ సంచాలకుడు జయరాజ్, డీఎఫ్‌వో రవిప్రసాద్, డీఏఓ గోవింద్, డీఈవో రాధాకిషన్, డీడబ్ల్యూవో బ్రహ్మాజీ , పీడీ మెప్మా ఇందిర, డీఐఈవో సత్యనారాయణ, అధికారులు. సిబ్బంది పాల్గొన్నారు.

ఆన్‌లైన్ అసాధ్యమే!

17లోగా 'ప్రజాపాలన' దరఖాస్తుల అప్‌లోడ్ కష్టమే..

అజాగ్రత్త వహిస్తే లబ్ధిదారుడికి నష్టమే..?

ఉమ్మడి మెదక్ జిల్లాలో 10,33,543 దరఖాస్తులు

ఆన్‌లైన్‌లో నమోదు కోసం 1,766 మంది ఆపరేటర్లు

నిర్దేశించిన గడువులోగా పూర్తికాదంటున్న సిబ్బంది

సిద్దిపేట, జనవరి 8 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని గ్రామాలు, పట్టణాల్లో ప్రజాపాలన పేరిటి వారం రోజుల పాటు ఆరు గ్యారెంటీలపై ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో గత నెల 28 నుంచి ఈ నెల 6వ తేదీ వరకు ప్రజల నుంచి 10,33,543 దరఖాస్తులు స్వీకరించారు. వీటన్నింటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయడానికి మొత్తం వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఆపరేటర్లతో పాటు కొంతమంది ప్రైవేట్ ఆపరేటర్లు కలుపుకొని మొత్తం 1,766 మందికి ఆన్‌లైన్ బాధ్యతలు అప్పగించింది. వీరంతా రోజూ ఒక్కొక్కరు 50 నుంచి 60 దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. స్వీకరించిన అన్ని దరఖాస్తులను ఈనెల 17లోపు ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. డేటా ఆపరేటర్లకు సైతం శిక్షణ ఇచ్చారు. కానీ నిర్దేశించిన సమయానికి డేటా ఎంట్రీ పూర్తి అవుతుందనే నమ్మకం లేదని కొంతమంది డేటాఎంట్రీ ఆపరేటర్లు బాహాటకంగానే చెబుతున్నారు. జిల్లాల కలెక్టర్లు రోజు వారీగా సమీక్షిస్తున్నారు. ఆపరేటర్ ఏమాత్రం అజాగ్రత్తగా నమోదు చేసినా లబ్ధిదారుడు నష్టపోవాల్సిందే. దీనికి తోడు సర్వర్ సమస్య కూడా తోడవుతుంది. పదే పదే లాగిన్ చేయాల్సిన పరిస్థితులు ఉంటున్నాయి. ఇక్కడ మరో సమస్య కూడా ఉత్పన్నమయ్యే అవకాశం ఉంది. దీనిని అదునుగా భావించి సైబర్ నేరగాళ్లు చొరబడే అవకాశాలు కూడా ఉన్నాయి. ప్రతిదీ జాగ్రత్తగా చేయాలంటే నిర్దేశించిన గడువులోగా డేటా ఎంట్రీ కావడం అసాధ్యమే అని చెప్పాలి.

ఆన్‌లైన్ సాధ్యమేనా?

సిద్దిపేట జిల్లాలో 684 మంది, మెదక్ జిల్లాలో 480 మంది, సంగారెడ్డి జిల్లాలో 602 మంది మొత్తం ఉమ్మడి మెదక్ జిల్లాలో 1,766 మంది వివిధ శాఖల్లో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లతో పాటుగా మరికొంది మంది ప్రైవేట్ ఆపరేటర్లు ఉన్నారు. వీరందరికీ శిక్షణ ఇచ్చి ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను ముమ్మరం చేశారు. ప్రతి ఆపరేటర్ రోజుకు 50 నుంచి 60 దరఖాస్తులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంది. 27 అంశాలను పథకాల వారీగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఒక దరఖాస్తుకు రూ. 5 చొప్పున, ప్రైవేట్ ఆపరేటర్‌కు రూ. 15 చొప్పున రాష్ట్ర ప్రభుత్వం నగదు చెల్లిస్తుంది. నిర్దేశించిన సంఖ్యకు అదనంగా ఎట్టి పరిస్థితుల్లోనూ చేయడానికి వీ లు లేదు. సిద్దిపేట జిల్లాలో మొత్తం 3,76,387 దరఖాస్తులు రాగా. వీటిలో ఐదు గ్యారెంటీలకు 3,19,261, ఇతర విభాగాలకు సంబంధించినవి 57,126 వచ్చాయి. వీటిని ఆన్‌లైన్ ప్రక్రియను 684 మంది ఆపరేటర్లతో చేపడుతున్నారు. మెదక్ జిల్లాలో 2,73,389 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 2,23,357 దరఖాస్తులు ఆరు గ్యారెంటీలవి కాగా ఇతర సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు 50,032 వచ్చాయి. వీటిని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడానికి జిల్లాలో వివిధ శాఖల్లో పనిచేస్తున్న 480 మంది కంప్యూటర్ ఆపరేటర్లకు బాధ్యతలు అప్పగించి ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను చేపట్టారు.

జిల్లాల వారీగా దరఖాస్తులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు

జిల్లా పేరు	వచ్చిన దరఖాస్తులు	ఆపరేటర్లు
సిద్దిపేట	3,76,387	684
మెదక్	2,73,389	480
సంగారెడ్డి	3,83,767	602
మొత్తం	10,33,543	1,766

సిద్దిపేట మున్సిపల్‌లో ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న సిబ్బంది

భక్తిశ్రద్ధలతో లక్ష బిల్వార్చన

ముగిసిన కల్యాణోత్సవం

చేర్యాల, జనవరి 8: కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో సోమవారం ఆలయవర్గాలు స్వామి వారికి లక్ష బిల్వార్చన, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం పూజలను నిర్వహించారు. రాష్ట్రంలోని అన్నివర్గాలు సుఖసంతోషాలతో జీవనం సాగించేందుకు స్వామి వారు అనుగ్రహించాలని కోరుతూ ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయవర్గాలు తెలిపాయి. కల్యాణం మరుసటి రోజు ఆలయ సంప్రదాయం మేరకు లక్ష బిల్వార్చనను ఘనంగా నిర్వహించారు. అనువంశిక వీరశైవ ఆగమశాస్త్ర ప్రకారం స్వామి వారి ఆలయంలో బిల్వార్చన, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, హారతి, మంత్రపుష్పం, మహానైవేద్యం తదితర పూజా కార్యక్రమాలను అర్చకులు చేశారు. లక్ష బిల్వాలను (మారేడు) స్వామి మూలవిరాట్ వద్ద సమర్పిస్తూ 1008 మల్లన్న నామస్మరణలను పఠిస్తూ అత్యంత వైభవంగా భక్తిశ్రద్ధలతో బిల్వార్చన పూజలు కొనసాగించారు. పూజల్లో ఆలయ అర్చకుడు మహాదేవుని శ్రీనివాస్, మనోహర్ దంపతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ఎ.బాలాజీ, ఏఈవోలు వైరాగ్యం అంజయ్య, గంగా శ్రీనివాస్, ఆలయ ప్రధా నార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, పర్యవేక్షకుడు నీల శేఖర్, ఆలయ కమిటీ సభ్యుడు చిరమల్ల నర్సింహులు పాల్గొన్నారు. రెండు రోజుల పాటు స్వామివారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించిన అర్చకులు, లక్ష బిల్వార్చన, మహాన్యాసపూర్వక పూజలతో కల్యాణ వేడుకలు ముగిసినట్లు ప్రకటించారు.

సమస్యలు త్వరగా పరిష్కరించాలి : ఎస్పీ అడ్మిన్

ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు ఎస్పీ

మెదక్ అర్బన్, జనవరి 8: అర్జీదారుల సమస్యలను త్వరగా పరిష్కరించాలని జిల్లా అదనపు ఎస్పీ మహేందర్, అధికారులకు ఆదేశించారు. సోమవారం ఎస్పీ ఆదేశానుసారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో అదనపు ఎస్పీ ఆధ్వర్యంలో ప్రజావాణి నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదులు స్వీకరించారు.

కొత్తపల్లి సర్పంచ్ చెక్ పవర్ రద్దు

పాపన్నపేట, జనవరి 8: కొత్తపల్లి సర్పంచ్ కుమ్మరి జగన్నాథం చెక్ పవర్ రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ రాజర్షి షా ఉత్తర్వులు జారీచేశారు. ఉప సర్పంచ్ అంజలి ఫిర్యాదు చేయగా, డీఎల్పీవో రిపోర్టు మేరకు చెక్ పవర్ రద్దు చేసినట్లు తెలిపారు. ఉప సర్పంచ్ సంతకం లేకుండా మరో పంచాయతీ మెంబర్ సంతకం తీసుకుని నిధులు డ్రా చేశారని, గ్రామ సభలు సక్రమంగా నిర్వహించలేదని పేర్కొన్నారు. ఇక ముందు ఎంపీవో, ఉప సర్పంచ్ ఉమ్మడి సంతకాలతో నిధులు డ్రా చేయవచ్చని సూచించారు.

అథ్లెటిక్స్‌లో మెదక్‌కు మూడో స్థానం

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 8: తమిళనాడులోని చెన్నైలో ఈనెల 3 నుంచి 6వ తేదీ వరకు జరిగిన సౌత్ జోన్ అంతర్ విశ్వవిద్యాలయ అథ్లెటిక్స్ లాంగ్ జంప్‌లో మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి తేజ తృతీయ స్థానంలో నిలిచిందని కళాశాల ప్రిన్సిపాల్ హుస్సేన్ సోమవారం తెలిపారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం తరపున ఈ ఘనతం సాధించిన ఏకైక విద్యార్థి తేజను సన్మానించి, అభినందించారు.

గ్రామీణ పేదరికం తగ్గింపు ప్రణాళికపై శిక్షణ

నర్సాపూర్, జనవరి 8: నర్సాపూర్‌లోని మండల సమాఖ్య కార్యాలయంలో గ్రామీణ పేదరికం తగ్గింపు ప్రణాళికపై నర్సాపూర్, శివంపేట్, చిలిపిచెడ్ మండలాల సీఏలు, సీసీలు, ఏపీఎంలకు సోమవారం శిక్షణ తరగతులను నిర్వహించారు. ప్రతి గ్రామంలోని కుటుంబ సభ్యులకు జీవనోపాధి, వనరుల ప్రణాళిక, సామాజిక అభివృద్ధి అంశాలపై శిక్షణతోపాటు అవగాహన కల్పించినట్లు ప్రాజెక్ట్ మేనేజర్ మోహన్ తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎంలు గౌరీశంకర్, వెంకటేశ్వర్లు, ప్రేమలత, మల్లేశం పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్

క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే

ఏఐబీఈఎస్ఎస్ మెదక్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి సోమవారం ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షుడు చాందీరామ్, ప్రధాన కార్యదర్శి సామ్యనాయక్, అసోసియేట్ అధ్యక్షుడు తారాసింగ్, నర్సాపూర్ డివిజన్ అధ్యక్షుడు ధన్‌సింగ్, ప్రధాన కార్యదర్శి రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

-నర్సాపూర్, జనవరి 8

శుభాకాంక్షలు

మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావును బీఆర్ఎస్ మెదక్ జిల్లా నాయకుడు కిషన్‌రావు దేశ్‌ముఖ్ సోమవారం హైదరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో మాసాయిపేట సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి ఉన్నారు.

-చేగుంట, జనవరి 8

అభివృద్ధి నిధులు కేటాయించాలి

సీఎంను కలిసిన ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్

మెదక్, జనవరి 8 (నమస్తే తెలంగాణ): మెదక్ నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలో మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ కలిసి విజ్ఞప్తిచేశారు. సీఎం స్పందిస్తూ త్వరలోనే నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయిస్తానని హామీనిచ్చారు.

టీడీఎస్ రిటర్న్స్ ఆన్‌లైన్ నమోదు బాధ్యత డీడీవోలదే

మెదక్, జనవరి 8 (నమస్తే తెలంగాణ): ప్రతి నెల ప్రభుత్వ ఉద్యోగుల జీతభత్యాల నుంచి రికవరీ చేసిన టీడీఎస్ రిటర్న్స్ ఆన్‌లైన్‌లో నమోదు అవుతుందో లేదో చూసుకునే బాధ్యత డీడీవోలదేనని ఇన్‌కంట్యాక్స్ కార్యాలయ అధికారి మానస్ నిరంజన్ తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల జీతభత్యాలు, ఇతరేతర ఆదాయపు పన్నుకు సంబంధించిన టీడీఎస్ పత్రాలు ఆన్‌లైన్‌లో ఎలా సమర్పించాలి అనే అంశంపై సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అవగాహన కల్పించారు. జిల్లాలోని డీడీవోలు, అకౌంటెంట్లకు పవర్ పాయింట్ ప్రజంటేషన్ చేశారు. జిల్లా ఖజానాధికారి చిన్నసాయిలు పాల్గొన్నారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరించిన జడ్పీ చైర్‌పర్సన్

క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ హేమలతా శేఖర్‌గౌడ్

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 8 : జిల్లా పంచాయతీరాజ్ మినిస్టిరీయల్ ఎంప్లాయీస్ యూనియన్ నూతన సంపత్సర క్యాలెండర్‌ను సోమవారం జడ్పీ కార్యాలయంలో జడ్పీ చైర్‌పర్సన్ హేమలతాశేఖర్‌గౌడ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీరాజ్ మినిస్టిరీయల్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు మాధవచారి, గౌరవ అధ్యక్షుడు ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి ఫణిరాజ్, నాయకులు ధనుంజయ్, గోపాల్, చం ద్రశేఖర్, మల్లేశం, మాణయ్య తదితరులు పాల్గొన్నారు.

నార్మల్ డెలివరీలకే అధిక ప్రాధాన్యం

రామాయంపేట, జనవరి 8: ప్రభుత్వ దవాఖానల్లో ఎక్కువ శాతం నార్మల్ డెలివరీలకే ప్రాధాన్యతను కల్పించాలని సీహెచ్‌సీ దవాఖాన వైద్యుడు, సూపరింటెండెంట్ డాక్టర్ లింబాద్రి పేర్కొన్నారు. సోమవారం రామాయంపేట సెక్టార్‌లోని రామాయంపేట, నార్సింగి, చిన్నశంకరంపేట, నిజాంపేట, డి.ధర్మారం మండలాలకు చెందిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులతో సెక్టార్ సమావేశం ఏర్పాటుచేసి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ దవాఖానలో నార్మల్ డెలివరీలకే ప్రాధాన్యత కల్పించేలా ప్రయత్నం చేయాలన్నారు. ముఖ్యంగా వైద్య సిబ్బంది ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు గ్రామీణ ప్రాంతాలలోని గర్భిణులకు అందుబాటులో ఉండాలన్నారు. వైద్యులు హరిప్రియ, జయలక్ష్మి, ప్రదీప్, సుకేషిని, రవికుమార్, సింధు ఉన్నారు.

సీఎంఆర్ లక్ష్యాలను పూర్తి చేయాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్లు రమేశ్, వెంకటేశ్వర్లు

మెదక్, జనవరి 8 (నమస్తే తెలంగాణ): రైస్ మిల్లులకు సీఎంఆర్ కింద కేటాయించిన ధాన్యాన్ని వేగంగా మిల్లింగ్ చేసి, కోటా మేరకు ఎఫ్‌సీఐకి బియ్యం నిల్వలు చేరవేసేలా పర్యవేక్షించాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, పౌర సరఫరాల శాఖ అధికారులతో ప్రజాపాలన దరఖాస్తుల కంప్యూటరీకరణ, కష్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) వానకాలం, యాసంగిపై సీఎస్ శాంత కుమారి, ప్రధాన కార్యదర్శి, కమిషనర్ డీఎస్ హన్‌లతో కలిసి మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మిల్లర్లకు కేటాయించిన లక్ష్యాలను మిల్లింగ్ కెపాసిటీ ప్రకారం, డైలీ టార్గెట్ పూర్తి చేసేందుకు కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు.

వంద శాతం పెంచేందుకు చర్యలు: కలెక్టర్

కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన డైలీ టార్గెట్ ప్రస్తుతం 79 శాతం జరుగుతున్నదని, దాన్ని 100 శాతం పెంచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులతో సీఎంఆర్‌పై సమీక్షించారు. మంత్రి సూచనల మేరకు జిల్లాలో ఎలాంటి జాప్యం లేకుండా సీఎంఆర్ డెలివరీ టార్గెట్ పూర్తి చేసేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెల 31 లోగా గడువు ముగుస్తుందని, పొడిగించే అవకాశం లేదని, గడువులోగా బియ్యం పెట్టాలని లేనిచో వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రమేశ్, వెంకటేశ్వర్లు, డీసీఎస్‌వో బ్రహ్మారావు, డీఎం సివిల్ సప్లయ్ హరికృష్ణ, ఈడీఎం సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ ఎంట్రీలో తప్పులు రావొద్దు

మెదక్‌రూరల్, జనవరి 8 : ప్రజాపాలనలో స్వీకరించిన దరఖాస్తులోని డేటాను ఎలాంటి తప్పులు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని మెదక్ అదనపు కలెక్టర్ రమేశ్ ఆదేశించారు. సోమవారం మెదక్ ఎంపీడీవో, తహసీల్ కార్యాలయల్లో డేటా ఎంట్రీ కేంద్రాలను తనిఖీ చేశారు.

17 లోగా ఎంట్రీ పూర్తయ్యేలా చూడాలి

కొల్చారం, జనవరి 8 : 17వ తేదీలోగా అభయహస్తం దరఖాస్తుల ఎంట్రీ పూర్తయ్యేలా చూడాలని జిల్లా అదనపు కలెక్టర్ రమేశ్ సూచించారు. కొల్చారంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో ప్రజాపాలనలో వచ్చిన అభయహస్తం దరఖాస్తుల డాటా ఎంట్రీలను ఆయన పరిశీలించారు.

పారదర్శకంగా లేకుండా ఆన్‌లైన్ చేయాలి

చిలిపిచెడ్, జనవరి 8: ప్రజాపాలన దరఖాస్తులను పరిశీలించి పారదర్శకంగా లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని నర్సాపూర్ ఆర్డీవో శ్రీనివాస్ తెలిపారు. సోమవారం తహసీల్‌లో ప్రజాపాలన దరఖాస్తుల ఎంట్రీని తహసీల్దార్ ముసాద్దీక్‌తో కలిసి పరిశీలించారు.

వెల్దుర్తి కస్తూర్బాలో ఖాళీలు

వెల్దుర్తి, జనవరి 8: వెల్దుర్తి కస్తూర్బా పాఠశాలలో వంటమనిషి, నైట్ వాచ్‌మెన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఎస్‌వో ఫాతీమా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన, ఆసక్తి ఉన్న మండలానికి చెందిన మహిళలు మాత్రమే ఈ నెల 9 నుంచి 18వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుతోపాటు పదో తరగతి మెమో, ఆధార్‌కార్డును అందించాలన్నారు.

పౌష్టికాహారాన్ని తీసుకోవాలి : సీడీపీవో

చిన్నశంకరంపేట, జనవరి 8: గర్భిణులు, బాలింతలు పోషక విలువలున్న ఆహారాన్ని తీసుకోవాలని సీడీపీవో స్వరూప సూచించారు. సోమవారం మండలంలోని జంగరాయి గిరిజన తండాలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. పౌష్టికాహారం తీసుకుంటే బిడ్డలు, తల్లులు ఆరోగ్యంగా ఉంటారని ఆమె తెలిపారు. గుడ్డు, ఆకుకూరలు, పాలు, పప్పుదినుసులు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శివకుమారి, అంగన్‌వాడీ ఇంద్ర పాల్గొన్నారు.

అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 8: మెదక్ పట్టణ శివారులోని పసుపులేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని మెదక్‌కు చెందిన రఘు సోమవారం కలెక్టర్ రాజర్షిషాకు ఫిర్యాదు చేశారు. పలుమార్లు మెదక్ తహసీల్దార్, మెదక్ డీఎస్పీతోపాటు పట్టణ సీఐకి మైనింగ్ ఏడీకి ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైన కలెక్టర్ ఇసుక అక్రమదారులపై, సహకరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

నర్సాపూర్ మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్‌గా నయీమొద్దీన్



ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి,మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ నయీమొద్దీన్

నర్సాపూర్, జనవరి 8: నర్సాపూర్ మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్‌గా ప్రస్తుత వైస్ చైర్మన్ నయీమొద్దీన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బీఆర్ఎస్‌కు చెందిన 9 మంది కౌన్సిలర్లు అడిషనల్ కలెక్టర్‌ను కలిసి అవిశ్వాస తీర్మానం ఇవ్వడంతో మున్సిపల్ చైర్మన్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీయాదవ్ అవిశ్వాసానికి ముందే తన పదవికి రాజీనామా చేశారు. రాజీనామాను కలెక్టర్ ఆమోదించడంతో వైస్ చైర్మన్‌గా ఉన్న నయీమొద్దీన్‌కు ఇన్‌చార్జి చైర్మన్‌గా నియమిస్తూ ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు వచ్చాయి. మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్ నయీమొద్దీన్‌కు ఇన్‌చార్జి చైర్మన్‌గా నియామక పత్రం అందజేశారు. కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు అశోక్‌గౌడ్, సత్యంగౌడ్, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి కరాటేలో విద్యార్థుల ప్రతిభ

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 8 : జిల్లా కేంద్రంలోని గుల్షన్‌క్లబ్‌లో రెంజుకీ షాటో కాన్ స్పోర్ట్స్ కరాటే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి కరాటో పోటీల్లో సుమారు వంద మందికి పైగా బాలబాలికలు పాల్గొనగా, పలువురు ప్రతిభ కనభర్చి పలు బెల్టులు సాధించారు. ఈ సందర్భంగా సీనియర్ కరాటే మాస్టార్ నగేశ్ బెల్టులు ప్రదానం చేశారు. ఈ పోటీల్లో కరాటే మాస్టార్లు నవీన్, విద్యాసాగర్, దినాకర్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ

రేగోడ్ మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో మంత్రి దామోదర ఆదేశాల మేరకు సోమవారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను జడ్పీటీసీ యాదగిరి, ఎంపీపీ సరోజన, ఆర్ఐ ఫిరోజ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ బాలలక్ష్మి పంపిణీ చేశారు.

-రేగోడ్, జనవరి 8

క్రీడాదుస్తులు అందజేత

చిలిపిచెడ్, జనవరి 8 : యువత క్రీడాస్ఫూర్తితో పోటీపడాలని గౌతాపూర్ సర్పంచ్ స్వరూపావిఠల్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని గౌతాపూర్ గ్రామంలోని యువకులకు క్రీడాదుస్తులను సర్పంచ్ అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసంతో పాటు స్నేహభావం పెంపొందిస్తాయన్నారు. యువకులు ప్రశాంత్, జిన్నాభాయ్, శ్యామ్, కృష్ణ,సుధాకర్, నిఖిల్, రహీం తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో 'వికసిత భారత్'

నిజాంపేట, జనవరి 8: మండలంలోని నార్లపూర్, వెంకటాపూర్(కె) గ్రామాల్లో వికసిత భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. పేదల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను అధికారులు గ్రామస్తులకు వివరించారు. అనంతరం సర్పంచ్ అమరసేనారెడ్డి, అధికారులు క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

మల్లికార్జున స్వామి, ఎల్లమ్మ ఆలయాల్లో చోరీ

రామాయంపేట, జనవరి 8: మల్లికార్జున స్వామి, ఎల్లమ్మ ఆలయాల్లో దుండగులు సోమవారం తెల్లవారుజామున చోరీకి పాల్పడ్డారు. ఆలయ తాళాలు పగలగొట్టి హుండీలను కొద్ది దూరం ఎత్తుకెళ్లి ధ్వంసం చేసి అందులోని నగదుతోపాటు భక్తుల ముడుపులు చోరీ చేసి తీసుకెళ్లారు. రామాయంపేట ఎస్సై రంజిత్ ఘటనా స్థలానికి చేరుకుని పరిసరాలు పరిశీలించి వివరాలను సేకరించారు. మల్లన్న, ఎల్లమ్మ ఆలయ కమిటీలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బలరామ అవతారంలో వేంకటేశ్వరుడు

రామాయంపేట, జనవరి 8: రామాయంపేటలో ధనుర్మాసోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. సోమవారం స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయం చుట్టూ మంగళహారతులతో అర్చకుడు వెంకట రమణాచార్యులు ఆధ్వర్యంలో ఊరేగించారు. స్వామివారిని బలరామ అవతారంలో పూజలు చేశారు. మహిళలు ఆలయంలో దీపాలు వెలిగించి మంగళహారతులు, నైవేద్యాలు సమర్పించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 18K. Ph: 9640400073/9160900024.
NT-319407-All

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న, లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమ